


# ప్రతిబింబం

విమలారామం

పాత పేషంట్లు-మందులు మార్పించుకొని వెళ్ళిపోయారు. నాలుగయిదు కొత్త కేసులు వచ్చాయి. అవీ అంతే-దగ్గు, జ్వరం.

"ఈ సీజనులో వూళ్ళో అంతా జ్వరాలనుకుంటాను....." అంది శారద అమాయకంగా.

నీలవేణి నవ్వింది. "వేసవి కాలంలో ఉడుక్కి వస్తాయి. సీతాకాలం చలికి వస్తాయి. వర్షాకాలంలో తడిస్తే వస్తాయి....దగ్గులకి, జ్వరాలకి సీజనంటూ లేదు, మనకు మన హాస్పటలుకి పని తగ్గటమూ లేదు"

ఇంతలో మరో పేషెంటు వచ్చింది.

"నీ పేరు?" నీలవేణి అడిగింది వ్రాసుకుంటూ.

"మాణిక్యం."

"జబ్బేమిటి?"

"కడుపునెప్పి తల్లే! సంపేస్తోంది. పొద్దువేల మొదలవుద్ది. మద్దేనం దాకా కడుపులో తిప్పేస్తది"

"సర్లే! అదంతా డాక్టరమ్మకి చెప్పుదువు గాని. డబ్బు తెచ్చావా?"

మాణిక్యం తలూపి చెంగు ముడి విప్పి రెండు రూపాయిలిచ్చింది.

నీలవేణి ముఖం చిట్లించింది. "రెండు కాదు, డాక్టరుగారి ఫీజు

ఐదు."

"తక్కింది తర్వాతిత్తాను తల్లే"

"వీల్లేదు....ముందే యివ్వాలి! లేకపోతే డాక్టరమ్మ చూడరు."

"ఉంటే అట్లాగే తెచ్చేటాన్ని తల్లే!"

"ఇదేం ధర్మాసుపత్రి కాదు. వెళ్ళు-వెళ్ళు."

"దయుంచుతల్లే! కడుపునెప్పితో సచ్చిపోతున్నానమ్మా! ధర్మాసుపత్రిలో సూపించుకున్నా తగ్గనేదు. డాక్టరమ్మది మహా దొడ్డపేరు. సూపించుకోవియ్యి తల్లే! ఇయేల కాపోతే రేపయినా తెచ్చిత్తా! నేనేడకి పోయేదాన్ని కానమ్మా!"

శారద వైపు చూసింది నీలవేణి, "వాళ్ళెప్పుడూ ఇంతే! ఒకపట్టాన వదిలిపోరు."

శారద మాణిక్యం వైపు జాలిగా చూపింది.

"సరే! ఈ వారంలో తెచ్చియ్యకపోతే ఊర్కొనేది లేదు" అంది నీలవేణి.

మాణిక్యం తల వూపింది. "అలాగే తల్లే!"

"లోపలికి వెళ్ళు" అంది నీలవేణి.

మాణిక్యాన్ని డాక్టరు గదిలోకి తీసుకు వెళ్ళింది శారద.

ఇందిరాదేవి అడిగింది. మాణిక్యం తన కడుపునెప్పి బాధ చెప్తుంది.

డాక్టరు ప్రశ్నలు వేస్తూ పరీక్ష ప్రారంభించింది.

ఇంతలో నీలవేణి లోపలికి వచ్చింది- "శంకర్రావుగారు వాళ్ళ మిసెస్‌ని తీసుకువచ్చారండి" అంది.

"నువ్వు బయటకూర్చో, మళ్ళీ పిలుస్తాను!" అంది డాక్టరు.

మాణిక్యం తలవూపి వరండాలోకి వెళ్ళి ఓ పక్కగా కూర్చుంది.

శంకర్రావు దంపతులు డాక్టర్ గదిలోకి అడుగు పెట్టారు.

"ఏమిటెలా వుంటోంది?" అని చిరునవ్వు నవ్వింది డాక్టరు.

"అప్పుడప్పుడూ గా కడుపు నెప్పిగా ఉంటోందిట డాక్టర్!" అన్నాడు శంకర్రావు - భార్యవైపు చూస్తూ.

"అవును మరి! నెలలు నిండుతున్న కొద్దీ అలాగే ఉంటుంది. పళ్ళు పాలు బాగా పుచ్చుకుంటున్నారా?"

"పుచ్చుకుంటూనే ఉన్నానండి!" అంది శంకర్రావు భార్య.

"ఒక్కసారి పరీక్ష చేస్తాను రండి." అని డాక్టరు పైకిలేచింది. శంకర్రావు భార్య పైకిలేచింది. శంకర్రావూ పైకి లేచాడు.

ఇంతలో నీలవేణి మళ్ళీ హడా

## పెచ్చి చేదు కథ

విడిగా లోపలికి వచ్చింది- "మిసెస్ చక్రపాణిగారు వచ్చారు డాక్టర్!"

డాక్టరు నోరు తెరవటానికి ముందే మిసెస్ చక్రపాణి లోపలికి విసురుగా దూసుకు వచ్చింది.

"డాక్టర్! వెరీ అర్జంట్."

"ఏమయిందండీ?" అని అడిగింది డాక్టరు కంగారుగా.

"మా బేబీకి సివియర్ స్టమక్ పెయిన్. కార్లో వుంది. ప్లీజ్! యు మస్ట్ హెల్ప్ హెర్ ఇమ్మీడియట్లీ! అసలు మిమ్మల్నే యింటికి రమ్మందామని ఫోన్ చేశాను. కానీ, మీ ఫోను ఔటాఫ్ ఆర్డరని చెప్పింది ఆపరేటరు." అంది మిసెస్ చక్రపాణి కంగారు కంగారుగా.

"అవునండీ! నేనూ ఎక్స్చేంజికి కంప్లయింటిచ్చాను." అని శంకర్రావు వైపు తిరిగి, "ఒక్కసారి మీరు బయట కూర్చోండి!" అంది డాక్టర్.

శంకర్రావు భార్యతో వెళ్ళి వరండాలో బెంచీమీద కూర్చున్నాడు.

డాక్టరు నీలవేణికి సంజ్ఞ చేసింది. ఆమె బయిటికి వెళ్ళి కార్లో కూర్చున్న మిసెస్ చక్రపాణిగారి కూతుర్ని తీసుకు వచ్చింది.

"హలో బేబీ! కడుపునెప్పా? ఎక్కడ? ఏది ఇలారా!" అంటూ డాక్టరు, దగ్గరకి పిల్చింది.

'బేబీ' అనబడే మిసెస్ చక్రపాణిగారి పదహారేళ్ళ అమ్మాయి డాక్టరు దగ్గరకి వచ్చింది. ఆవిడ ఓపిగ్గా నవ్వుతూ ఎన్నో ప్రశ్నలు వేసింది. ఎప్పుడెప్పుడు ఏమి తింటుందో అడిగింది. ఏమిటి తింటుందో అడిగింది. పావుగంట సేపు రకరకాల పరీక్షలు చేసింది. చివరకి ఓ పెద్ద మందుల లిస్టు వ్రాసింది.

"పళ్ళరసం యివ్వండి. కొంచెం బ్రెడ్. అంతే!" అని నవ్వింది డాక్టరు.

"అమ్మో! ఆకలేస్తే!" అంది 'బేబీ.'

"రెండ్రోజులు నేను చెప్పినట్లు వింటే నువ్వేన్నీ తినొచ్చు బేబీ!"

"కడునెప్పి తగ్గిపోతుందాండీ!"

"ఆఁ! తప్పకుండా తగ్గిపోతుంది."

"మరి మేం శలవు తీసుకుంటాము డాక్టర్! మీకు చాలా థేంక్స్!" అని పైకి లేచింది మిసెస్ చక్రపాణి.

"నో మెన్షన్!"

"కంగారులో మర్చేపోయా!" అంటూ తన వేనిటీ బేగ్ తెరిచి వందనోటు తీసి "మీ ఫీజు" అని యిచ్చింది మిసెస్ చక్రపాణి.

"తొందరేముచ్చింది దండీ!" అంటూ నోటు పుచ్చుకొని డ్రాయర్లో పెట్టింది డాక్టరు.

మిసెస్ చక్రపాణి గారిని.... ఆవిడ కూతురనే బేబిని స్వయంగా సాగనంపటానికి కారు దాకా వెళ్ళింది డాక్టరు ఇందిరాదేవి.

"కడుపునెప్పికి అన్ని మందులా?" అంది శారద ఆశ్చర్యపోతూ.

"ష్! అసలు ఆ కడుపు నెప్పి ఎందుకు వచ్చిందో తెలుసా?" అని నవ్వింది నీలవేణి.

"ఎందుకు?"

"తిండి ఎక్కువయి, తిన్నది జీర్ణం కాక."

శారద ఆశ్చర్యపోయింది.

"నిజమా!"

"అవును, నిజం. పళ్ళరసం తాగు అంటే 'అమ్మో—ఆకలేస్తే?' అని ఆ అమ్మాయి అంది చూసారా! అసలా అమ్మాయికి ఆకలంటే ఎలా వుంటుందో ఎప్పుడేనా తెలిస్తేగా? రోజూ పార్టీలు, విందులు. కడుపుకి కాసేపు కూడా రెస్టుండదాయె."

అంతలో డాక్టరు ఇందిరాదేవి తిరిగి వచ్చింది.

"శంకర్రావుగార్ని పిల్చుకురా!"

అతను సిగరెట్టు కాల్చుకోవటానికి కాబోలు అలా వీధిలోకి వెళ్ళాడు.

అతని భార్యని పిల్చుకు వచ్చింది శారద. డాక్టరు ఆమెను ఇనస్పెక్షన్ రూములోకి తీసుకు వెళ్ళాక కడుపులోని మాట దాచుకోలేక నీలవేణిని అడిగింది శారద.

"అబ్బ! కడుపు కనిపిస్తోంది కాని, ఆవిడ వొంట్లో ఎక్కడా రక్తమాంసాలున్నట్టే లేదు. మరి మందులన్నీ ఏమవుతున్నాయి?" అంది అమాయకంగా.

"మందులు తప్ప బలమైన ఆహారం తింటేగా?"

"పళ్ళు, పాలు బాగానే పుచ్చుకుంటున్నానని చెప్పిందిగా ఆవిడ!"

"అలా అనక ఏమంటారు? ఆయన్ది గుమాస్తా ఉద్యోగం. సరి పడా పళ్ళు కొనటానికి డబ్బెక్కడుంటుంది? డాక్టరలా అడగటం.... ఆవిడలా చెప్పటం- అదంతా ఒక రివాజు. అంతే!"

"ఇన్ని మందులుకొంటున్నారు, మరి వాటికీ డబ్బు ఖర్చవుతుందిగా?"

"అక్కడే వుంది అసలు కిటుకు. మందులు, డాక్టరు ఫీజు ఎన్ని వందలయినా ఫర్వాలేదు. బిల్లుపెడితే వాళ్ళ ఆఫీసు యిస్తుంది. అదే వాళ్ళావిడకి బత్తాయి పండుకి పావలా కూడా యివ్వరు. అవే రూల్సు."

శారద తెల్లబోయింది.

"మనక్కావల్సింది కూడా ఆ రూల్సే" అని నవ్వింది నీలవేణి.

కడుపులో ఏదో మెలి దిరిగినట్టయింది శారదకి.

డాక్టరు పిల్చింది. ఇద్దరూ వెళ్ళారు. ఇంతలో శంకర్రావు కూడా వచ్చాడు.

"మరేం కంగారులేదు. బాగా రెస్టు తీసుకోమనండి. పళ్ళు పాలూ బాగా పుచ్చుకోమనండి" అంది డాక్టరు ఎప్పటి లాగే.

"అలాగే నండి!" అన్నాడు శంకర్రావు మామూలుగానే.

"ఈ మందులు వాడండి" అని లిస్టు యిచ్చింది డాక్టరుకి. దండం పెట్టి బయటకి వచ్చారు.

"మీ ఫీజు పదిహేను...." అంది నీలవేణి.

అతను డబ్బు యిచ్చాడు.

"ఈ మాటు వచ్చేసరికి బిల్లు రెడీగా ఉంచుతాను."

అతను తలవూపి నర్సులిద్దర్కీ థాంక్సు చెప్పి భార్యతో సహా వెళ్ళిపోయాడు.

నీలవేణి చూపుల్ని గుర్తించి "రమ్మంటావా తల్లీ!" అంది వరండాలో మఘాలగా కూర్చున్న మాణిక్యం.

నీలవేణి తల వూపింది.

మాణిక్యంతో పాటు నర్సు లిద్దరూ డాక్టరు గదిలో అడుగుపెట్టారు.

"ఓహో! ఇంకా నువ్వొకదానివున్నావేమిటి?...." అంటూనే నొసలు చిట్లించి "ఊఁ! రా....వచ్చి అలా బల్లమీద పడుకో!...." అంది డాక్టరు.

మాణిక్యం వెళ్ళి పడుకుంది. పరీక్ష చేస్తూ డాక్టరు అడిగింది-

"ఎంత మంది పిల్లలు?"

"నల్గురమ్మగోరూ!"

"ఏం పని చేస్తూంటావు?"

"కూలిపని కెల్తానండి."

"నీ రోజు కూలి యెంత?"

"మూడ్రూపాయిలండి!"

"నీకీ నెప్పి ఎప్పు డెప్పుడు వస్తుంది?"

"ప్రొద్దుటేల వస్తది....మద్దేనం దాకా సంపేత్తది....మల్లీ మూడు గంటలేల నెప్పి వస్తది....రేత్రి తొంగునే దాకా ఒకటే బాధమ్మా!"

"ప్రొద్దున్న పనికి వెళ్ళేముందు ఏం తింటావు?"

"టీ తాగుతానమ్మా!"

"అన్నం తినవా?"

"లేదమ్మా! మద్దేనం గంజి.... రేత్రి ఇంతన్నం. అంతే!"

"గంజి తాగాక, అన్నం తిన్నాక నెప్పి తగ్గుతుందా?"

మాణిక్యం వెంటనే జవాబివ్వ లేదు.

"చెప్పు!" డాక్టరు రెట్టించింది.

"అ! కొంచెం తగ్గినట్టే ఉంటది అమ్మగోరూ!"

డాక్టరు బయాటకు వచ్చింది. కాగితం మీద వ్రాపి, "ఈ మందులు పుచ్చుకో!" అని మాణిక్యాని కిచ్చింది.

"ఈ మందులు పుచ్చుకుంటే నా కడుపు నెప్పి తగ్గిపోద్దామ్మా?" అని ఆశగా అడిగింది మాణిక్యం.

ఆ మాట డాక్టరు వింద్దో లేదో? "ఫీజు నర్సుకియ్యి." అని మాత్రం అంది ఏదో వ్రాసుకుంటూ.

డాక్టరు తనవైపు చూడక పోయినా అలవాటుగా దండంపెట్టి బయటకు నడిచింది మాణిక్యం.

"డాక్టరమ్మగారి ఫీజెంతమ్మా?" అని నీలవేణిని అడిగింది.

"అసలు పది. నీ ముఖం చూసి ఐదని చెప్పాను. ఈ మాటొచ్చి నప్పుడు ఇప్పటి మూడు, అప్పటి మూడు మొత్తం ఆరూ పట్టు కురా!" అంది నీలవేణి.

"అలాగేనమ్మా!.... ఈ మందులు...."

"మెయిన్ బజార్లో మందులు షాపులుంటాయి. అక్కడడుగు, ఇస్తారు."

"ఎంతవుద్దమ్మా!"

"ఎంతోనా! ఒక ఎనిమిది రూపాయలు పెడితే వచ్చేస్తాయి."

మాణిక్యం మ్రాన్పడిపోయింది.

"వెంటనే వెళ్ళి మందులు కొనుక్కో!"

"ఇంకెక్కడా తక్కువలో దొరకవామ్మా?" మాణిక్యం గొంతు చాల బలహీనంగా పలికింది.

"బలే దానివే! రోగం తగ్గా లంటే మంచిమందు వాడాలి! వెళ్ళు వెళ్ళు."

మాణిక్యం తలవూపి సత్తువ లేని దానిలా అడుగులో అడుగు

వేసుకుంటూ వెళ్ళిపోయింది.

నీలవేణి శారదవైపు చూసింది.

శారద ముఖం కళావిహీనంగా ఉంది. "పాపం! మూడు రూపాయిలకి- పిల్లలకి తిండిపెట్టి తను గంజి తాగటానికే కష్టం. ఇక మందులేం కొంటుంది?"

"అసలు మాణిక్యానికి వచ్చే కడుపునెప్పి ఏమిటో తెలుసా?" అంది నీలవేణి.

శారద కళ్ళింత చేసుకొని అడిగింది "ఏమిటి?"

"తిండి లేకుండా చాకిరీ చేసే వాళ్ళకందరికీ వచ్చేదే-ఆకలినెప్పి. గంజి తాగాక, అన్నం తిన్నాక నెప్పితగ్గుతోందంటే అర్థమేమిటి?"

శారద గుండె కలుక్కుమంది. "మరి ఆ సంగతే మాణిక్యంతో చెప్పటం మంచిది కదండీ?"

"మీరెంత అమాయకులండీ! మన దగ్గరకు పేషంట్లు వచ్చేది ఎందుకని? రోగాలున్నాయని చెప్పుకోటానికి. వాళ్ళకి మనం జబ్బులున్నాయని చెపితేనే వాళ్ళకి సంతోషం! మందులు వ్రాసిస్తేనే సంతృప్తి!"

శారద కళ్ళప్పగించి చూసింది.

"అవునండీ! ఇది నిజం. ఇప్పుడిప్పుడు వచ్చిన కేసులే చూడండి- ముగ్గురికీ కడుపు నెప్పి....ఒకళ్ళకి తిండి ఎక్కువయి కడుపు నెప్పి, ఇంకొకరికి తిన్న తిండిలో బలం లేక కడుపు నెప్పి, మరొకరికి తిండిలేక కడుపు నెప్పి...."

శారదకి గుండె కలుక్కుమంది.

"అయినా, మనం ఉన్నదున్నట్టు ఆలా చెప్పకూడదు. మీవి అసలు జబ్బులుకావు....మీ బాధకి మందు మీ చేతుల్లోనే వుంది....అని నిజం చెప్పేస్తే ఇంక డాక్టరెందుకు? మందులెందుకు? అప్పుడు హాస్పటలూ ఉండదు-మనమూ ఉండము" అని నీలవేణి నవ్వింది.

శారదకి కడుపులో ఎవరో దేవినట్టయింది.

"ఏమిటలా అయిపోయారు?"

"ఏం లేదండి!...." అంటూ కుర్చీలో వెనక్కివాలి కళ్ళుమూసుకుంది శారద. కడుపులో ఏదో నెప్పిగా ఉందని పైకి చెప్పుకోలేక పోయింది. తన గుండె నిండిన బాధే తన కడుపునెప్పికి కారణమైందని గ్రహించలేక పోయింది.

ఆమెను పరీక్షగా చూస్తున్న నీలవేణికి అంతా అర్థమయింది.

"ఇంకా మీకు కొత్త. ఇప్పుడలాగే ఉంటుంది. కొన్నాళ్ళుపోతే అదే అలవాటవుతుంది!" అంది నెమ్మదిగా.

*